


(...)ు వీధిలోంచి ఇంటిలోకి పరుగెత్తుకొని వచ్చి, ఆయాస పడుతూ "అమ్మా! అమ్మా! మరేమో వీధిలోకి పువ్వు లమ్మ వచ్చాయేవ్" అంది తల్లితో.

వినీవిననట్టుగా ఊరుకుంది తల్లి.

"అమ్మా! పువ్వులు వచ్చేయే! కొనవుటే, కొనవుటే! వెళ్లిపో తాయే!" అని, వెనక్కి పరుగెత్తు కొని వెళ్లి "అబ్బీ! ఉండు, మా అమ్మ వస్తూంది," అని పువ్వు లఅబ్బితో చెప్పి, మళ్ళీ ఇంటిలోకి పరుగెత్తుకుని వచ్చి "అమ్మా! కొన వుటే? కొనవుటే?" అని తల్లిబుజాలు పట్టుకొని వేళ్లాడింది పిల్ల.

"రోజూ పువ్వులే నీకు! రోజూ కొనడానికి డబ్బు లెక్కడినుంచి వస్తాయని? పొమ్మను," అని కసిరి వేసింది తల్లి.

"ఇవాళేనే, ఇవాళేనే!" అంది పిల్ల దీనంగా.

"ఏరోజు కారోజే 'ఇవాళ!' ఏరోజు రాదు 'ఇవాళ'! అంది తల్లి గట్టిగా.

వీధిలో పువ్వులబ్బి "అమ్మ గారూ!" అని కేకలువేస్తున్నాడు.

"అబ్బీ! వస్తూంది ఉండు మా అమ్మ. పదవే మ్మా! పదవే!" అని చిందులు తొక్కింది సుశీల.

"పోనీ పసిపిల్లకదా" అని పాపం తల్లిమనస్సు మెత్తపడింది. కాని ఆమె "ఏమోనమ్మా! నాకు తెలి యదు! నేను తిట్లుతినలేనమ్మా! మీ నాన్న వస్తే నన్ను కోప్పడ తారు!" అని విసుగు కొంది.

"కొంబడరే, కొంబడరే!" అంది సుశీల, తల్లికొంగు పట్టుకొని వేళ్లాడుతూ.

"అలాగే అంటావు నీకేం? నన్నూ కేకలు వేసేది.! రోజూ కొంటే కొంబడ రేమిటి?" అంది తల్లి పెద్దగొంతుక పెట్టుకొని.

"కొనేలమ్మా! ఇవాళ కేనే!" అంది బిడ్డ దీనంగా.

తల్లి ఓర్చుకోలేకపోయింది. "కొంటానుకానినాన్నతో చెప్పకేం అమ్మ కొందని," అంది.

"ఉఁఉఁ, చెప్పను," అంది సుశీల.

"మరేమో నాన్నతో 'అమ్మ ఆ వీధిలో వాళ్ల ఇంటికి వెళగా వాళ్లు తాంబూలంలో పెట్టిఇచ్చారు' అని చెప్పేమాటుంటే కొంటాను. లేక పోతే అసలు కొనను." అంది తల్లి.

"ఉఁ. అలాగే! నాన్న అడిగితే 'నాన్నా! నాన్నా! అమ్మా, నేనూ కలిసి ఆవీధిలో వాళ్లఇంటికి వెళ్లాం. వాళ్లు మరేమో అమ్మకి తాంబూ లంలో పువ్వులదండ పెట్టిఇచ్చారు' అని చెప్పతాను" అంది సుశీల ముద్దరాలులాగు.

నిజమేకాబోలు అని నమ్మింది తల్లి.

తల్లీ, పిల్లా వెళ్లి పువ్వులదండ ఒక కాసిది కొనుక్కున్నారు. రెండుముక్కలుచేసి చెరోముక్కా తలలో పెట్టుకొన్నారు. ఇంతటిలో తండ్రి వచ్చాడు. కాళ్లకి నీళ్లు తేవ డానికి తల్లి చేద తీసుకొని పెరటి లోకి వెళ్లింది.

సుశీల తండ్రితో "నాన్నా! నాన్నా! మరేమో అమ్మ పువ్వులు

(36-వ పేజీ చూడండి)

# రహస్యమంటే

(32 వ పేజీ తరువాయి)

నాకోసమని కొంది నాన్నా! కొని, నాన్న ఇంటికి వచ్చాక 'పువ్వు లెక్కడివే?' అని అడిగితే, మరేమో 'మేము ఆ వీథిలో వాళ్ల ఇంటికి వెళ్లాం. వాళ్లు తాంబూలంలో పెట్టిఇచ్చారు' అని చెప్పమంది చూడు నాన్నా!" అని చెప్పి "నీతో చెప్పేనని మళ్ళీ అమ్మతో చెప్పకేం, కోంబడుతుంది." అంది, చేతితో సంజ్ఞలు చేస్తూ. "చూడు నాన్నా! పువ్వు లెంత బాగున్నాయో పెట్టుకొంటే!" అని తల వెనక్కి తిప్పి తండ్రికి చూపించింది.

పిల్ల అల్లరిచేసి కొనిపించి ఉంటుందని తండ్రి అనుకొని, చూసి సంతోషించాడు. కోటు తీసి చిలుక కొయ్యకి తగిలించాడు.

ఇంతలో తల్లి చేద తీసుకొని ఇంటిలోకి వచ్చింది. తండ్రిఎదుట సుశీల అమ్మతో "అమ్మా! మరేమో, నాన్నతో చెప్పేశాను. నువ్వు పువ్వులు కొనిపెట్టి, వాళ్ల ఇంటికి వెళ్లితే వాళ్లు తాంబూలంలో పెట్టి మనకి ఇచ్చారని చెప్పమన్నావని" అంది సుశీల ఉత్సాహంతో.

తల్లి, చేతిలో చేద కిందపెట్టడం మాటే మరిచిపోయి, రెండో చేతితో బుగ్గలు నొక్కుకొంటూ నిల్చుండిపోయింది.

"రహస్యం దాని కడుపులో దాగుతుం దనుకొన్నావు! ఏమి. పాపం!" అన్నాడు తండ్రి చిరునవ్వుతో.

"నేను కొననే అమ్మా అంటూంటే ప్రాణం తీసి పోసీ పిల్ల కదా పాపం అని జాలిపడి కొని, ఇన్ని చెప్పితే, అప్పటికి గంగిరెద్దులాగు బుర్ర ఆడించి నాన్న రాగానే చెప్పేస్తావు? అవ్వ" అంది తల్లి నోటికి చెయ్యి అడ్డుపెట్టుకొని.

"ఏం. చెప్పితే?" అంది సుశీల.

"అయినా దానితో రహస్యమేమిటి. నా మొహం గాని!" అని తల్లి పైకి అనుకొంది.

"నీకు జ్ఞానం రావడానికి!" అన్నాడు తండ్రి.

"రహస్యమంటే?" అందిసుశీల. తల్లి. తండ్రి ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.